ప్రధాని మోదీ పాలనలో దేశ కీర్తి ప్రతిష్టలు ప్రపంచస్థాయికి

మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్



బీజేపీ సభ్యత్వాలను అందజేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: ప్రపంచంలో అత్యధిక సభ్యత్వాలు కలిగిన పార్టీ బీజేపీ అని, ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో భారతదేశ కీర్తి ప్రతిష్టలు ప్రపంచస్థాయికి చేరాయని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం జీడిమెట్ల డివిజన్‌లో జరిగిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ పలువురికి బీజేపీ సభ్యత్వాలు అందజేసి మాట్లాడారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని తీర్చడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. దేశానికి స్వాతంత్య్రం సిద్ధించి 77 సంవత్సరాలైనా విద్య, వైద్య సమస్యలు నెలకొన్నాయని, ఎంతోమందికి ఉండటానికి ఇల్లు కూడా లేవన్నారు. ప్రధాని నరేంద్రమోదీ వచ్చిన తర్వాత కొన్ని రంగాల్లో గణనీయమైన మార్పు వచ్చిందని, నేడు ప్రపంచంలో దేశానికి గుర్తింపు లభిస్తోందన్నారు. విశ్వకర్మలాంటి అనేక రకాల స్కీములను దేశంలో తీసుకువచ్చి పేదరికం పోగొట్టేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని, బీజేపీ నాయకత్వాన్ని బలోపేతం చేయడానికి ఇంటింటికి తిరిగి కార్యకర్తలు, నాయకులు రికార్డు స్థాయిలో సభ్యత్వాలను నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి, జిల్లా జనరల్ సెక్రెటరీ గిరివర్ధన్, జీడిమెట్ల డివిజన్ కార్పొరేటర్ తారా చంద్రారెడ్డి, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు కట్ట కుమార్, సీనియర్ నాయకుడు వాసు, డివిజన్ ప్రెసిడెంట్ రాజేశ్వర్ చారి, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అలివేలు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక 'బతుకమ్మ'

ఎమ్మెల్యే వివేకానంద్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: బతుకమ్మ వేడుకలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ శ్రీనివాసనగర్‌కు చెందిన 'స్ఫూర్తి ఉమెన్ గ్రూప్' ఆధ్వర్యంలో ప్రతీయేటా నిర్వహించే బతుకమ్మ వేడుకల పోస్టర్‌ను ఆదివారం ఎమ్మెల్యేతో కలిసి నిజాంపేట్ కార్పొరేటర్ రాఘవేందర్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ పువ్వులలో అమ్మవారిని చూస్తూ మహిళలంతా ఒక దగ్గర చేరి ఐకమత్యంగా ఆటలాడుతూ అమ్మవారిని కొలుస్తూ ఆడిపాడే వేడుక బతుకమ్మ అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి ఉమెన్ గ్రూప్ అధ్యక్షురాలు కొడారి రమాదేవి, ఉమాదేవి, శివకుమారి, గీత, పల్లవి, రమాదేవి, మంజుల, యశస్విని, రాజేశ్వరి, చందు, లక్ష్మి, భాగ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

దుండిగల్ మున్సిపాలిటీ డీ పోచంపల్లికి చెందిన డబుల్ బెడ్ రూమ్' ఇళ్ల లబ్ధిదారులు కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఇప్పటికే ఫ్లాట్లు మంజూరైన వారికి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు నవీన్, ప్రధాన కార్యదర్శి వినోద్ నాయక్, ఉపాధ్యక్షుడు భాస్కర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

క్రీడలతో విద్యార్థుల మధ్య స్నేహ సంబంధాలు



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సత్యనారాయణ

నిజాంపేట్: క్రీడలు విద్యార్థుల్లో గెలవాలనే పట్టుదలను పెంచడంతో పాటు స్నేహ సంబంధాలను పెంపొందిస్తాయని బాలానగర్ డిప్యూటీ పోలీస్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. ఆదివారం బాచుపల్లిలోని వీఆర్‌ఎస్ విజ్ఞాన జ్యోతి స్కూల్‌లో సీబీఎస్ఇ ఖోఖో టోర్నమెంట్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 200 సీబీఎస్ఇ పాఠశాలల నుంచి సుమారు 5,500 క్రీడాకారులు పాల్గొన్నారు. బాలూరు, బాలికల అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల్లో పోటీ పడనున్నారు. ఈ నెల 25 వరకు ఈ టోర్నమెంట్ జరుగనుంది. ఈ సందర్భంగా ఖోఖో టోర్నమెంట్ క్లస్టర్‌ను డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ, అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ హన్మంతరావు, ఆసియా ఖోఖో బంగారు పతాక విజేత ప్రమోద్ థోరాట్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఆటల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో విద్యార్థులు పోటా పడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్, ఒలింపిక్ టార్చ్ కార్యక్రమాలు హైలెట్‌గా నిలిచాయి. ఈ కార్యక్రమంలో విజ్ఞాన జ్యోతి ట్రస్టీ సభ్యులు వల్లూరుపల్లి రాజా రామ మోహన్‌రావు, వల్లూరుపల్లి రాజశేఖర్, డాక్టర్ వల్లూరుపల్లి గీత, వల్లూరుపల్లి రాజ్‌కుమార్, వల్లూరుపల్లి రమణ, పాఠశాల డైరెక్టర్ కొడాలి విజయరాణి తదితరులు పాల్గొన్నారు.

బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన అల్లూరి



అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నిజాంపేట్: రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు అని డాక్టర్ ఎం.ఆర్.ఎస్. రాజు అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని భోగాపురం ఏయిర్‌పోర్ట్‌కు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టిన సందర్భంగా ఆదివారం ప్రగతినగర్‌లోని అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.ఆర్.ఎస్.రాజు మాట్లాడుతూ ఇన్నాళ్లు మరుగుపరిచిన స్వాతంత్య్ర సమరయోధులను ప్రభుత్వాలు గుర్తించి తగిన రీతిన గౌరవించడం సంతోషదాయకమన్నారు. అల్లూరి అలుపెరుగని పోరాటం చేశారని, ఆయన నేటి యువతకు స్ఫూర్తిదాయకమ్నారు. ఈ కార్యక్రమంలో దాట్ల వెంకటపతి రాజు, సాయి గుణరంజన్‌రాజు, గోపాలకృష్ణం రాజు, నరసింహ రాజు, రామకృష్ణమ రాజు, రామ రాజు, కుందన్ వర్మ, బాలు, అంజి, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఇతర కాలనీలకు ఆదర్శంగా నిలుద్దాం



కాలనీ ఎంట్రన్స్‌లో చెత్తను తొలగిస్తున్న కాలనీప్రజలు



శుభ్రం చేసిన అనంతరం ఫోటో..

జీడిమెట్ల: మన కాలనీని మనమే శుభ్రం చేసుకుని ఇతర కాలనీలకు ఆదర్శంగా నిలవాలని ఎస్.ఆర్ నాయక్‌నగర్ కాలనీ అధ్యక్షులు గోగినేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం కాలనీ ఎంట్రన్స్‌లో చెత్తను అసోసియేషన్ ఆధ్వర్యంలో తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతకాలంగా కాలనీ ఎంట్రన్స్‌లో బస్టాప్ వద్ద ప్రతిరోజు కొందరు చెత్తను వేస్తూ ప్రాంతాన్ని అపరిశుభ్రం చేస్తున్నారన్నారు. ఈ విషయమై మున్సిపల్ సిబ్బంది హెచ్చరించడంతోపాటు బోర్డులు పెట్టినా వారు చెత్త వేయడం మానడం లేదన్నారు. దీంతో ప్రయాణికులు ఎవ్వరు కూడా బస్‌స్టాప్‌లో నిలబడలేని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. బస్‌స్టాప్‌లో చెత్త ఉండటం వలన బస్సులు ఆపడం లేదని డ్రైవర్లు చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో స్పందించి కాలనీవెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కాలనీవాసులు అందరు కలిసి కాలనీ ఎంట్రన్స్ వద్ద ఉన్న చెత్తాచెదాలను తొలగించామని తెలిపారు. అనంతరం చెత్తను ట్రాక్టర్‌లో తరలించి మట్టిని పోయించి చెట్లను నాటామన్నారు. దీంతో కాలనీ ఎంట్రన్స్ భాగం శుభ్రంగా అవ్వడమేగాక రేపటి నుంచి బస్సులను సైతం బస్టాప్‌లో నిలుపుకోవచ్చని పేర్కొన్నారు. కాలనీని శుభ్రపరచిన వారిలో అసోసియేషన్ సభ్యులతోపాటు కాలనీవాసులు ఉన్నారు.

నాడు మోడ్రన్.. నేడు స్క్రాప్..!

- ముణ్నాళ్ల ముచ్చటగా మోడ్రన్ షీ టాయిలెట్లు
- నిర్వహణ లేక వెలవెలబోతున్న వైనం
- కొన్నిచోట్ల శిథిలావస్థకు చేరిన సామగ్రి
- అధికారుల నిర్లక్ష్యంతో లక్షల రూపాయల ప్రజాధనం వృథా

అధికారుల నిర్లక్ష్యానికి ప్రజాధనం ఏ విధంగా వృథా అవుతాయో మరోసారి నిరూపితమైంది. గత ప్రభుత్వ హయాంలో ఎంతో హంగు ఆర్భాటంగా నగరాన్ని క్లీన్‌గా ఉంచటానికి ఏర్పాటు చేసిన మోడ్రన్ షీ టాయిలెట్లు ఆ తరువాత నిర్వహణ లోపం కారణంగా మరుగన పడ్డాయి. దీంతో లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన టాయిలెట్లు ఇప్పుడు స్క్రాప్‌గా మారాయి.



నేడు షీ టాయిలెట్ స్క్రాప్‌గా మార్చి జీహెచ్ఎంసీ కార్యాలయావరణలోకి తరలిస్తున్న దృశ్యం



నాడు గాజులరామారం చౌరస్తాలో

చింతల్: నగర సుందరీకరణలో భాగంగా అప్పటి తెలంగాణ ప్రభుత్వం 2019లో ప్రధాన కూడళ్లలో సులభ్ కాంప్లెక్స్‌లను తొలగించి మోడ్రన్ షీ టాయిలెట్లను అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. ఈ మోడ్రన్ షీ టాయిలెట్లు ప్రజలకు ఎంత వరకు అందుబాటులోకి వచ్చేయో అన్నది అటు ఉంచితే కాంట్రాక్టర్లకు, అధికారులకు మాత్రం కాసులు కురిపించాయన్న విమర్శలు వినిపించాయి. 2019లో ఎంతో హంగు ఆర్భాటాలతో రూ.7.30 లక్షలు మిషనరీతోపాటు మరో రెండున్నర లక్షల రూపాయలు వాటి ఏర్పాటు కోసం మొత్తం పది లక్షల రూపాయలతో కుత్బుల్లాపూర్‌లోని పలు ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేశారు. ఈ మోడ్రన్ షీ టాయిలెట్లలో ఐదు రూపాయల నాణెంతో అందులోనికి వెళ్లి ఉపయోగించుకునే వెసులుబాటు కల్పించడంతో పాటు నాప్కిన్‌లు వగైరా వస్తువులను అందులో ప్రవేశపెట్టి అట్టహాసంగా ప్రారంభించారు.

మూణ్నాళ్ల ముచ్చటే..

అయితే ప్రారంభించిన నాటి నుంచి ఈ మోడ్రన్ షీ టాయిలెట్లు నిర్వహణ లేక వెలవెలపోయాయి. దీంతో ఇవి ప్రధాన కూడళ్ళలో ఉండడంతో అవి మందుబాబులకు, పలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారాయి. మరి కొంతమంది దొంగలు షీ టాయిలెట్లలో ఉన్న విలువైన సామగ్రిని ఎత్తుకెళ్లినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. నేటికీ నాలుగున్నర సంవత్సరాలు గడిచినా వాటిని పట్టించుకున్న పాపానలేకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయి.

నేడు స్క్రాప్, తుక్కుగా మార్పు...

2019లో అట్టహాసంగా ప్రారంభించిన షీ టాయిలెట్లు నేడు రోడ్డు విస్తరణ నేపథ్యంలో స్క్రాప్‌గా మార్చేశారు జీహెచ్ఎంసీ అధికారులు. గాజుల రామారం చౌరస్తాలో జీడిమెట్ల ఈఎస్ఐ ఆసుపత్రి ఎదురుగా ఏర్పాటు చేసిన లక్షలు విలువ చేసే ఈ మూడు షీ టాయిలెట్లు జేసీబీతో సహాయంతో అక్కడి నుంచి తొలగించి కార్యాలయానికి తరలించినట్టు సిబ్బంది పేర్కొన్నారు. అదే విధంగా రంగారెడ్డినగర్‌లో ఏర్పాటు చేసిన సులభ్ కాంప్లెక్స్ సైతం దాని ఎదురుగా ఉన్న భవనాలకు అడ్డుగా వస్తుందని పలువురి రాజకీయ ఒత్తిళ్ల కారణంగా జీహెచ్ఎంసీ అధికారులు అక్కడి నుంచి తొలగించి గిరినగర్ వద్ద నాలా సమీపంలో పడవేశారు. దీంతో లక్షలాది రూపాయల ప్రజాధనం దుర్వినియోగమైన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి.

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

నిజాంపేట్: ప్రగతినగర్ వాసవీ లేఅవుట్‌లోని సర్వేపల్లి రాధాకృష్ణన్ పార్కులో ఆదివారం మేడా కల్యాణ్ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కొనసాగిన క్యాంపులో బీపీ, డయాబెటీస్, ఇతర వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి మందులు అందించారు.

'మనూ'లో అంతరాయం కల్పిస్తే ఆన్‌లైన్ బోధన

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పరిస్థితిని సమీక్షించడానికి యూనివర్సిటీ ఉన్నతాధికారులతో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ సమావేశమయ్యారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ఆదివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యంగా విద్యార్థులు తరగతులు బహిష్కరించి ఆందోళనలు చేస్తే అందుకు తగిన నిర్ణయాలు తీసుకోవాలని నిర్ణయించారు. క్యాంపస్‌లో చక్కటి వాతావరణానికి అంతరాయం కల్పిస్తే క్యాంపస్‌లోని వసతి గృహాలను మూసి వేసి, విద్యార్థులు వాటిని ఖాళీ చేయించాల్సి వస్తుందని వారు స్పష్టం చేశారు. మిగిలిన సెమిస్టర్ తరగతులను ఎవరికీ ఇబ్బంది కలుగకుండా తరగతులను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. కొందరు కావాలని తరగతులు జరుగకుండా అంతరాయం కల్పిస్తున్నారని దీన్ని ఎంత మాత్రం సహించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడానికి ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని, ఆ కమిటీకి తమ సమస్యలను వివరించేందుకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇలాంటిది కాదంటూ అశాంతి వాతావరణం సృష్టించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే సహించమన్నారు.

భవన యజమానికి నోటీసులు

రంగారెడ్డినగర్: రోడ్డు అక్రమించి షెడ్డు ఏర్పాటు చేసిన భవన యజమానికి ఐలా అధికారులు నోటీసులు జారీ చేశారు..వివరాల్లోకి వెళితే.. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ పారిశ్రామిక ప్రాంతం జగద్గిరిగుట్ట- ఐడీపీఎల్ రోడ్డులోని ప్లాంట్ నెంబరు-9లో ఇటీవల ఓ భవన యజమాని ముందు భాగంగా ఎలాంటి అనుమతులు లేకుండా షెడ్డును ఏర్పాటు చేశాడు. షెడ్డు ప్రారంభ దశలోనే గుర్తించిన ఐలా అధికారులు అడ్డు చెప్పినా ఇటీవల వరుస సెలవులు రావడంతో వాటిని పట్టించుకోకుండా సదరు భవన యజమాని షెడ్డును పూర్తి చేశారు. దీంతో ఐలా అధికారులు నోటీసులు జారీ చేశారు. అయితే 100 గజాల్లో నిర్మించిన సదరు భవనానికి నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ ఏర్పాటు చేయడం గమనార్హం. దీనిపై అధికారులు ఏ చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.



పారిశ్రామికవాడ ప్లాట్-9 లో షెడ్డు ఏర్పాటు చేసిన దృశ్యం

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం యూనియన్ కృషి



సమావేశంలో మాట్లాడుతున్న గడ్డమీద బాలరాజుగౌడ్

సుభాష్‌నగర్: అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాల కేటాయింపు కోసం యూనియన్ కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం నాయకులు స్పష్టం చేశారు. ఆదివారం సూరారం వీవీపీ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు అధ్యక్షత నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కోశాధికారి మోతే వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం కట్టుబడి పని చేస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. మునిపెన్నడూ లేని విధంగా జర్నలిస్టులకు హౌసింగ్ ఏర్పాటు చేసే విధంగా ప్రభుత్వం జీవోలు జారీ చేసేందుకు ప్రత్యేక చొరవ చూపిస్తుందని తెలిపారు. ప్రభుత్వం పెద్దలు చూపిస్తున్న మార్గదర్శకాల మేరకు సమాజంలో జర్నలిస్టుగా పనిచేస్తున్న ప్రతి ఒక్కరిని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. రానున్న వారం రోజులలో ప్రాంతాలవారీగా సమావేశాలను ఏర్పాటు చేసి జిల్లావ్యాప్తంగా వర్కింగ్ జర్నలిస్టులను గుర్తించే ప్రక్రియను చేపట్టాలని దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో సేకరిస్తున్నటువంటి జర్నలిస్టుల వివరాలను మీడియా అకాడమీకి అందజేస్తామని జిల్లా అధ్యక్షులు గడ్డమీద బాలరాజ్ స్పష్టం చేశారు. వచ్చే నెలలో నిర్వహించ తలపెట్టిన ముఖ్యమంత్రితో జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం విజయవంతం చేయడానికి ప్రతి జర్నలిస్ట్ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రామ్‌రెడ్డి, కోశాధికారి బిక్షపతి, ప్రెస్ క్లబ్‌ల అధ్యక్ష కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాలగంగాధర్ తిలక్‌కు ఘన నివాళి



తిలక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

దుండిగల్: వినాయక ఉత్సవాల ద్వారా ప్రజల్లో దేశభక్తిని పెంపొందించి బ్రిటీషర్లకు వెన్నులో వణుకు పుట్టించిన మహనీయుడు బాలగంగాధర్ తిలక్ అని బీజేపీ నాయకుడు పీసరి కృష్ణారెడ్డి అన్నారు. భగవద్గీత జాగరణ ఫౌండేషన్ అధ్యక్షుడు గుల్ల జగదీష్ ఆధ్వర్యంలో ఆదివారం భౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో బాలగంగాధార్ తిలక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీసరి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆనాడు బాలగంగాధర్ తిలక్ ప్రోద్భలంతో ప్రారంభమైన గణేశ్ ఉత్సవాలు దేశ శక్తికి రేకెత్తించాయని, నేడు కులాలకు అతీతంగా ప్రతి బస్తీలలో హిందువులలో చైతన్యం తీసుకువచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ దుండిగల్ ఖండ కార్యవహక్ లక్ష్మారెడ్డి, శివ, నాగేషు, తిరుపతి రెడ్డి, సత్యాచారి, తలారి శ్రీశైలం, ప్రసాద్, బాలకృష్ణ, అంజనేయులుచారి పాల్గొన్నారు.

చెరువులు, కుంటలను పరిరక్షిద్దాం



దుండిగలోని పెద్ద దామర చెరువు వద్ద శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

దుండిగల్: చెరువులు, కుంటలను పరిరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరావు అన్నారు. స్వచ్ఛతా హీ సేవా-2024లో భాగంగా ఆదివారం దుండిగల్ మున్సిపల్ పరిధిలోని పెద్ద దామర చెరువు, చిన్న చెరువుల సమీపంలో పెరిగిన పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్, చెత్త వ్యర్థాలను మున్సిపల్ సిబ్బంది తొలగించారు. జేసీబీతో చెరువుల వద్ద చదును చేసి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ సాత్విక్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచందర్, జవాన్లు సురేందర్, నరసింహ, వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడిపై చర్యలు తీసుకోవాలి



కమ్యూనిటీ హాల్ బోర్డు ఏర్పాటు చేసిన స్థానికులు

సుభాష్‌నగర్: దంపతుల మరణానంతరం వారి ఇంటి స్థలాన్ని బీఆర్ఎస్ నాయకుడు అమ్ముకోవడం దారుణమని సుభాష్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సోమన్నగారి శ్రీధర్ రెడ్డి అన్నారు. ఇంటిని అమ్మిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా సదరు ఇంటిని శ్రీసాయినగర్ కమిటీ వెల్ఫేర్ అసోసియేషన్ హాలుగా పేర్కొంటూ బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ సుభాష్‌నగర్ డివిజన్ సూరారం 60 గజాల కాలనీ శ్రీసాయినగర్‌లో దివ్యాంగులైన కాశీరామ్, లక్ష్మి దంపతులు గత సంవత్సరం క్రితం అనారోగ్యంతో మృతి చెందారని, వారికి సొంత వారసులు లేకపోవడంతో ఇదే అదునుగా భావించిన స్థానికంగా ఉన్న బీఆర్‌ఎస్ నాయకుడు అమ్ముకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. సదరు ఇంటిని ప్రజల ఉపయోగాలు ఉపయోగిస్తున్నట్లు తెలిపారు.

మోదీ పాలనలో దేశాభివృద్ధి



అందజేస్తున్న మల్లారెడ్డి, మల్లేష్ యాదవ్‌లు

దుండిగల్: ప్రధాని మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని జిల్లా బీజేపీ కన్వీనర్ డాక్టర్ ఎస్. మల్లారెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ తండా- 2లో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లా కన్వీనర్ డాక్టర్ ఎస్.మల్లారెడ్డి హాజరై యువతకు సభ్యత్వ నమోదు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణుష్, నాయకులు వెంకటేష్ నాయక్, విజయ్ నాయక్ శ్రీను నాయక్, భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



పాదయాత్రకు హాజరైన ఎంపీ ఈటల రాజేందర్

సుభాష్‌నగర్: శ్రీ నిఖిల సాయి మైత్రేయ మధుసూదన సరస్వతి పీఠం నిర్వాహకుడు సుబ్రహ్మణ్య స్వామి 18వ శబరిమల మహా పాదయాత్రను పురస్కరించుకుని ఆదివారం సూరారం కాలనీజె సంతోషనగర్ శివాలయంలో అయ్యప్ప పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప పడిపూజ, అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించగా అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం సుబ్రహ్మణ్యస్వామి మాట్లాడుతూ తాను ఇప్పటికి 27సార్లు అయ్యప్ప మాలధారణ వేసి స్వామిని దర్శించుకోవడం జరిగిందని, ఇందులో భాగంగా పదిహేడు సార్లు పాదయాత్ర చేసినట్టు తెలిపారు. ఈసారి పద్దెనిమిదవ మహా పాదయాత్ర చేస్తున్నట్టు, మొత్తం ముప్పై రెండు రోజులపాటు జరిగే ఈ పాదయాత్రలో అక్టోబర్ 25 తేదీన శబరిమల చేసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్, ముఖ్య సలహాదారులు సర్వేపల్లి రమేష్ కుమార్, కార్యవర్గ సభ్యులు గడ్డం రాంబాబు, హరి రాఘవేంద్ర, శ్రీధరాచార్యులు, బీజేపీ నాయకులు వాసు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


ఈత ఒక సాధనంగా పాఠ్యాంశంలో చేర్చాలి



ఈటల రాజేందర్‌కు వినతి పత్రం అందజేస్తున్న రవీందర్ ముదిరాజ్

సుభాష్‌నగర్: ఈతపై అవగాహన లేమితో ప్రతియేటా విద్యార్థులు, యువకులు వయసుతో తారతమ్యం లేకుండా మృత్యువాత పడుతున్నారని పర్యావరణ ప్రేమికుడు, సామాజిక కార్యకర్త కోలా రవీందర్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం ఈత ఒక సాధనంగా పాఠ్యాంశంలో చేర్చాలని, చెరువులు, బావుల్లో మరణాలను నియంత్రించాలని ఆయన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కి వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా ఈతరం పిల్లలకు ఈతపై అవగాహన ఎంతో అవసరమని రవీందర్ ముదిరాజ్ ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. ఈత అనేది ఒక సాధనగా గుర్తించి విద్యార్థి దశనుంచి నేర్పించాలని, అందుకు ప్రత్యేకంగా ఆరు సబ్జెక్టుల్లో, ఈతను కూడా పాఠ్యాంశంగా చేర్చాలని విన్నవించారు. ఈత తెలియక పోవడంతో ప్రతియేటా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1500 మంది యువకులు, విద్యార్థులు నీట మునిగి మృతి చెందుతున్నారని, ఈత వచ్చిన వారికి 3వ తరగతి నుంచి 10 తరగతి వరకు అదనంగా 2 మార్కులు ఇచ్చేలా కేంద్ర, రాష్ట్ర, ప్రభుత్వా దృష్టికి తీసుకువెళ్లాలన్నారు.

కూన వెంకటేశ్‌గౌడ్‌కు నివాళి



కూన వెంకటేష్‌గౌడ్ దశదిన కర్మలో ఎమ్మెల్యే వివేకానంద్ తదితరులు

సుభాష్‌నగర్: టీడీపీ సీనియర్ నేత, సనత్‌నగర్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, ప్రముఖ వ్యాపారవేత్త కూన వెంకటేష్‌గౌడ్ దశదిన కర్మ ఆదివారం గాజులరామారంలోని కేవీఎస్ ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్, మాజీమంత్రి మరి శశిధర్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై వెంకటేష్‌గౌడ్ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. అనంతరం వెంకటేష్‌గౌడ్ భార్య కూన సత్యకళ, కుమారులు కూన శ్రావణ్‌గౌడ్, గౌరీ శంకర్‌గౌడ్‌లను పరామర్శించారు. వీరితోపాటు ఇతర జిల్లాల నుంచి పలు పార్టీల నాయకులు, గౌడ సంఘ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కూన వెంకటేష్‌గౌడ్ విద్యార్థి దశనుంచి నేటి వరకు పార్టీలో ఆయన చేసిన సేవ కార్యక్రమాలను గుర్తిస్తూ పాటల రూపంలో గాయకుడు జడల రమేష్ వినిపించారు. అంతేకాకుండా ప్రాంగణంలో కూన వెంకటేష్‌గౌడ్ చిన్ననాటి నుంచి చేసిన సేవలపై ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు.

భరత్ నగర్‌లో ఉచిత వైద్య శిబిరం

కూకట్‌పల్లి: హెల్పింగ్ హ్యూమన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భరత్‌నగర్ కాలనీలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో ఫిజియోథెరపీ, డయాబెటిస్, కళ్ల సంబంధిత వ్యాధుల నిర్ధారణ కోసం ఉచితంగా చికిత్స అందజేశారు. అదే విధంగా బ్లడ్ డొనేషన్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యూమన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మగ్బూల్ మట్లాడుతూ.. ప్రతి సంవత్సరం పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించేందుకు క్యాంప్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.